నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 21 జనవరి 2024 | ADILABAD

చిరుత పిల్లల సంచారం

చిరుత పిల్లల పాదముద్రలు సేకరిస్తున్న అటవీశాఖ అధికారి

కుంటాల, జనవరి 20 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని కల్లూరు శివారులో వారం రోజులుగా చిరుత పిల్లలు సంచరిస్తున్నాయి. గురువారం మహేశ్ రావు, శుక్రవారం భోజారెడ్డి తమ పొలాల వద్ద చూశారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. శుక్రవారం గ్రామస్తులు ఎఫ్‌బీవో హరిలతకు సమాచారం ఇచ్చారు. ఆమె శనివారం ఉదయం తోటల్లో చిరుత పిల్లల పాద ముద్రలను సేకరించారు. ఐదు సెంటీమీటర్లు ఉన్నట్లు, అవి చిరుత పిల్లలకు చెందినవని తెలిపారు. వాటి భద్రత దృష్ట్యా రైతులు తమ చేలలో విద్యుత్ తీగలను అమర్చకూడదని కోరారు.

నాగోబా పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఉట్నూర్, జనవరి 20 : వచ్చే నెల ఫిబ్రవరిలో జరగనున్న ఆదివాసుల ఆరాధ్యదైవం నాగోబా జాతర పోస్టర్లను శనివారం ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, కుమ్ర ఈశ్వరీబాయిలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, బీఈడీ ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, మెస్రం వంశీయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా..

బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా, జనవరి 20 : కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా ఉంటానని బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం భైంసా పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముథోల్ మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా ఉండాలని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే వరకు పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ముథోల్ మండల శాఖ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్, నాయకులు బామ్ని రాజన్న, సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, పోతన్న యాదవ్, అనిల్, రవీందర్‌రెడ్డి, మురళిగౌడ్, రమేశ్, ఫారూఖ్ హైమద్, ఆసిఫ్, పోతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బడిలో మోగిన ఎన్నికల గంట

పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

- ఎలక్షన్ నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసిన విద్యాశాఖ
- ఈనెల 29వ తేదీన 1,273 స్కూల్స్‌లో ఎన్నికలు
- అదేరోజు చైర్మన్, వైఎస్ చైర్మన్ ఎంపిక
- పల్లెల్లో పండుగ వాతావరణం

ఆదిలాబాద్, జనవరి 20(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల నిర్వహణ కోసం విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు ప్రక్రియ కొనసాగనుండగా.. శనివారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ చేశారు. గవర్నమెంట్ స్కూల్స్‌లో తల్లిదండ్రులను భాగస్వాములను చేసి పర్యవేక్షణ, అభివృద్ధి, విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేసేలా ఎస్ఎంసీలు పని చేస్తాయి. రెండేళ్లకోసారి ఎన్నికల నిర్వహిస్తారు. చివరిసారిగా 2019 సంవత్సరంలో జరుగగా.. నాలుగేళ్ల తర్వాత నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 1,273 ఎస్ఎంసీలు ఉండగా.. అన్ని స్కూళ్లలో ఈ ఎన్నికలు జరుపడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిబంధనలు..

- ఎన్నికల నిర్వహణలో భాగంగా 1 నుంచి 8వ తరగతి వరకు.. ప్రతి తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులను ఎంపిక చేస్తారు. ముగ్గురిలో ఇద్దరు మహిళలు ఉండనుండగా.. ఇందులో ఒకరికి రిజర్వేషన్ వర్తింపజేస్తారు. తల్లి లేదా తండ్రికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంటుంది.
- పాఠశాలలోని ప్రతి క్లాసులో కనీసం ఆరుగురు విద్యార్థులు ఉండాలి. ఇంతకంటే తక్కువ ఉంటే ఇతర తరగతుల్లో కలిపేస్తారు. విద్యార్థుల సంఖ్యలో 50 శాతం తల్లిదండ్రులు హాజరైతే ఎన్నికలు నిర్వహిస్తారు.
- ప్రతి పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్, ఎక్స్ అఫీషియో సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులను ఎన్నుకుంటారు. ఎన్నికలు చేతులెత్తడం, పేర్లు చెప్పడం విధానంలో జరుగుతాయి. చైర్మన్, వైస్ చైర్మన్ ఇద్దరిలో ఎవరైనా ఒకరు మహిళ ఉండాలి. ● పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెంబర్, కన్వీనర్‌గా ఉంటాడు. ఉపాధ్యాయుడు, పాఠశాల ఉన్న ప్రాంతంలోని ప్రజాప్రతినిధి, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్ఎం, మహిళా సంఘాల నాయకులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా వ్యవహరిస్తారు. ● కో-ఆప్షన్ సభ్యులుగా గ్రామ కమిటీ, వార్డు కమిటీల నుంచి ఇద్దరు విద్యావంతులు, విశ్రాంత ఉద్యోగులు వ్యవహరిస్తారు.

ఎన్నికల నిర్వహణ

- ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు ప్రతి తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులు ఉంటారు. ఐదుగురు పురుషులు, పది మంది మహిళలు మొత్తం 15 మందితో కమిటీ ఏర్పడుతున్నది. ● ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 8 తరగతుల్లో ప్రతి క్లాసులో ముగ్గురి చొప్పున ఎనిమిది మంది పురుషులు, 18 మంది మహిళలతో మొత్తం 24 మందితో కమిటీ ఉంటుంది. ● ఉన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతుల నుంచి ప్రతి క్లాసుకు ముగ్గురు చొప్పున ముగ్గురు పురుషులు, ఆరుగురు మహిళలతో కమిటీని ఏర్పాటు చేస్తారు.


పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటీసు
No. 2751/SS/CMO/T44/2018. Dated 18.1.2024
1. ఎలక్టెడ్ సభ్యులు (ప్రతి తరగతి నుండి ముగ్గురు సభ్యులు)
2. చైర్మన్ & వైస్ చైర్మన్
3. ఎక్స్ అఫీషియో సభ్యులు
4. కో-ఆప్టెడ్ సభ్యులు
ప్రధానోపాధ్యాయుడు
తాంసి మండలంలోని కప్పర్ల ఎస్ఎంసీ ఎన్నికల నోటీసు జారీ చేసిన ప్రధానోపాధ్యాయుడు


సిరికొండ ఎస్ఎంసీ ఎన్నికల నోటీఫికేషన్

పలు అంశాల పర్యవేక్షణ

- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) సభ్యులు ప్రతి రెండు నెలలకోసారి సమావేశం అవుతాయి. విద్యార్థుల సంఖ్యను పెంచడం, రెగ్యూలర్‌గా వచ్చేలా చూడడం, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ పంటి బాధ్యతలను నిర్వహిస్తారు. వీటితోపాటు పచ్చదనం, పరిశుభ్రత, బడి నిధుల వినియోగాన్ని పర్యవేక్షిస్తారు.
- శనివారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా తల్లిదండ్రుల జాబితాను పాఠశాలల్లో అందుబాటులో ఉంచారు. జాబితాపై 22, 23 తేదీల్లో అభ్యంతరాలను స్వీకరిస్తారు. 24న తుది జాబితా ప్రదర్శించి, 29న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సభ్యుల ఎంపికకు ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. వెంటనే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మొదటి సమావేశం అవుతారు. ఈ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకున్నది.

నవోదయ ప్రశాంతం

- 22 పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీగా పరీక్షల నిర్వహణ
- 4,458 మంది విద్యార్థులకు 3,703 మంది హాజరు

హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

నిర్మల్ అర్బన్/ఆదిలాబాద్ రూరల్, జనవరి 20 : జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కాగజ్‌నగర్‌లోని నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు 22 కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు పరీక్ష కొనసాగింది. ఈ పరీక్షకు 4,458 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 3,703 మంది హాజరయ్యారు. ఆసిఫాబాద్ జిల్లాలో 1,079 మందికి 850, ఆదిలాబాద్‌లో 983 మందికి 819, మంచిర్యాలలో 1,079 మందికి 979, నిర్మల్ జిల్లాలో 1,208 మందికి 1,055 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా.. కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను డీఈవో ప్రణీత సందర్శించారు.

సమావేశంలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు

నాణ్యమైన పవర్‌ను అందించాలి..

- కుల ధ్రువీకరణ పత్రాలను సేకరించి పథకాలు వర్తింపజేయాలి..
- విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా లోపాలను సరిదిద్దాలి..
- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

ఎదులాపురం, జనవరి 20 : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఆదిలాబాద్ విద్యుత్ సర్కిల్ అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ఇబ్బందులు పడకుండా వ్యవసాయ కనెక్షన్లను మంజూరు చేయాలని పేర్కొన్నారు. గృహ వినియోగదారుల కుల ధ్రువీకరణ పత్రాలు సేకరించి ప్రభుత్వ పథకాలను వర్తింప జేయాలన్నారు. బకాయిలను వసూలు చేయాలని, రైతులు ఆటోస్టార్టర్‌లను తొలగించేలా చూడాలని, కెపాసిటర్‌లు వినియోగించేలా ప్రోత్సహించడం ద్వారా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ పడకుండా ఉంటుందన్నారు. 11 కేవీ, 33 కేవీ లైన్‌లలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తుగా పర్యవేక్షించి లోపాలను సరిదిద్దాలను సూచించారు. క్రమంగా 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల నిర్వహణ చేపట్టాలని, లాగ్ పుస్తకం, ఎల్సీ, ఇంట్రాప్షన్ బుక్‌లు, ఇతర రిజిస్టర్‌లను ఏడీలు, ఏఈలు పర్యవేక్షించాలని ఎండీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఈలు ఈదన్న, ప్రభాకర్, హరికృష్ణ, సుభాష్, అంకౌట్స్ అఫీసర్ శంకర్, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

క్రీడలతోపాటు విద్యపై దృష్టిసారించాలి..

- ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు బొజ్జు, కోవ లక్ష్మి
- ఉట్నూర్‌లో ముగిసిన ఐఎస్ఎల్ రాష్ట్రస్థాయి క్రీడలు
- ఓవరాల్ చాంపియన్ షిప్ సోషల్ వెల్ఫేర్ గురుకులం
- ద్వితీయ స్థానంలో ట్రైబల్ వెల్ఫేర్

ట్రోఫీని అందుకుంటున్న క్రీడాకారులు

ఉట్నూర్, జనవరి 20 : క్రీడలతోపాటు విద్యపై దృష్టిసారించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శనివారం ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలో ఐఎస్ఎల్ రాష్ట్ర ముగింపు కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గిరిజన ప్రాంతాల్లో రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గిరిజనులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. అనంతరం వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఓవరాల్ చాంపియన్ షిప్ సోషల్ వెల్ఫేర్ గురుకులం

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుకుల ఐఎస్ఎల్ రాష్ట్ర పోటీలు శనివారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఏడు సొసైటీ గురుకుల క్రీడాకారులు తమ తమ పోటీల్లో సత్తా చాటారు. అయితే ఓవరల్ చాంపియన్ షిప్‌ను సోషల్ వెల్ఫేర్ గురుకులం దక్కించుకోగా, ద్వితీయ స్థానంలో గిరిజన గురుకులం సొసైటీ స్టార్ నిలిచింది. అథ్లెటిక్స్ ఓవరల్ చాంపియన్ షిప్, గేమ్స్ ఓవరల్ చాంపియన్ షిప్‌ను సాంఘీక సంక్షేమ గురుకులం గెలుచుకోవడం విశేషం. ఆర్చరీ ఓవరల్ చాంపియన్ షిప్‌ను స్టార్ కైవసం చేసుకున్నది. రెజ్లింగ్ చాంపియన్లుగా టిమ్రిస్ జట్టు, బాక్సింగ్ చాంపియన్లుగా బీసీ గురుకులం సొసైటీ జట్టు గెలుచుకున్నది. ఇక హాకీ అండర్-17 గర్ల్స్ విభాగంలో ఈఎంఆర్ఎస్ 13 పాయింట్లతో మొదటి, ద్వితీయ స్థానంలో టీఆర్ఈఐఎస్, మూడో స్థానంలో టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ నిలిచాయి. అండర్-17 విభాగంలో స్టార్స్ 13 పాయింట్లతో మొదటి స్థానం, టీఎస్ఎంజేపీఎస్ 11 పాయింట్లతో ద్వితీయ, టీఎంఆర్ఐఈఎస్ మూడో స్థానంలో నిలిచాయి. ఇలా రాష్ట్రస్థాయి క్రీడలు ముగిశాయి. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి..

ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఎదులాపురం, జనవరి 20 : గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలీస్ పరేడ్ మైదానం, జాతీయ పతాకావిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసాపత్రాల బహూకరణ వంటి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అతిథులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు తాగునీరు, టెంట్లు వేయాలని తెలిపారు. ఉత్తమ ఉద్యోగుల పేర్లను పంపించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి పాల్గొన్నారు.

అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

పల్లె దవాఖాన ప్రారంభం

బాసర, జనవరి 20 : మండల కేంద్రంలోని కౌట గ్రామంలో గల ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులతోపాటు పల్లె దవాఖానను శనివారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ముథోల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. అనంతరం తరగతి గదుల నిర్మాణానికి స్థలాన్ని దానంగా ఇచ్చిన సోలంకి గంగాధర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కందుల కొనుగోళ్లకు శ్రీకారం

- 23వ తేదీ నుంచి నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కేంద్రాలు
- మార్కెట్ యార్డుల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి..
- ఆదిలాబాద్ రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఎదులాపురం, జనవరి 20 : ఆదిలాబాద్ జిల్లాలో కందుల కొనుగోళ్లకు శ్రీకారం చుట్టనున్నట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పేర్కొన్నారు. శనివారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 23 నుంచి నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాల్లో కేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు. మిగిలిన తాంసి, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాల్లో వారంలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధర స్థిరీకరణ పథకం కింద కందుల ధరను రోజువారీగా నాఫెడ్ అధికారులు నిర్ణయిస్తారని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మార్కెట్ ఏడీ శ్రీనివాస్, డీఎస్‌వో కిరణ్‌కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి మోహన్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

- ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్

మాట్లాడుతున్న ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్

ఇంద్రవెల్లి, జనవరి 20 : సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్ అన్నారు. శనివారం హీరాపూర్ పంచాయతీ పరిధిలోని లాల్‌టేక్డీ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వరప్రసాద్ పాల్గొని చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉచిత న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న చిన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. ఆర్థిక స్థోమత లేని ఎస్సీ, ఎస్టీలతోపాటు మహిళలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. లాల్‌టేక్డీ గ్రామంలో ఇరువర్గాల మధ్య జరిగిన గోడవలను రాయి సెంటర్ ద్వారా పరిష్కరించుకోవడం సంతోషంగా ఉందని, రాయిసెంటర్ పెద్దలను అభినందించారు. రాయిసెంటర్ ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి శమాదేశ్‌పాండే, ఉట్నూర్ ఇన్‌చార్జి జడ్జి హూషన్, వడగాం రాయిసెంటర్ సార్‌మేడి మెస్రం చిన్నుపటేల్, ఎస్ఐ సునీల్, స్థానిక సర్పంచ్ గోడం నాగోరావ్, మాజీ సర్పంచ్ జాదవ్ బిక్కు, వాల్గొండ గ్రామ పటేల్ లచ్చు పటేల్, ఆదివాసీ నాయకుడు రగురాం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాథోడ్ వసంత్ రావ్, జీపీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కారోబారి తోడసం మారుతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగోబాకు చేరుకున్న ప్రచార రథం

ఇంద్రవెల్లి, జనవరి 20 : నాగోబాకు నిర్వహించే మహాపూజతోపాటు గంగాజలం సేకరణ పాదయాత్రపై గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన ఎడ్లబండి (చక్డా) ప్రచార రథం శనివారం సాయంత్రం కేస్లాపూర్‌కు చేరుకున్నది. ఈ ప్రచార రథం కేస్లాపూర్ నుంచి జనవరి 14వ తేదీన బయలుదేరగా.. ఏడు గ్రామాల్లో ప్రచారం చేసి తిరిగి రాగా మెస్రం వంశీయులతోపాటు గ్రామస్తులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. మెస్రం వంశీయుల్లో పెద్దవాడైన మడావి వంశీయుల ఇంటికి చేరుకుని రాత్రి అక్కడే బస చేశారు. ఆదివారం కేస్లాపూర్ నుంచి గంగాజల సేకరణ కోసం పాదయాత్రగా బయలుదేరి వెళ్లనున్నారని మెస్రం వంశీయులు తెలిపారు.

కేస్లాపూర్‌కు వెళ్తున్న ప్రచార ఎడ్లబండి

ఆహార భద్రత చట్టం విధానాలను అనుసరించాలి..

ఆహార భద్రత తనిఖీ అధికారి శ్రీధర్

ఎదులాపురం, జనవరి 20 : ఆహార పదార్థాలు, వాటి సంబంధిత ఉత్పత్తులను అమ్మే దుకాణా యజమానులు ఆహార భద్రత చట్టం విధి విధానాలను అనుసరించాలని ఆహార భద్రత ఆదిలాబాద్ జిల్లా అధికారి శ్రీధర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణం, గుడిహత్నూర్ మండల కేంద్రాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన షాపులను తనిఖీ చేశారు. వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని, ఆహార భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. లేకపోతే జరిమానాలతోపాటు ఐదేండ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు.

ఎమ్మార్పీ లేని సిగరెట్లు అమ్మరాదు..

ఎమ్మార్పీ లేని సిగరెట్లను అమ్మడం నేరమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం అధికారి శ్రీధర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్, మావలలో షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. దుకాణాల్లో అమ్మే పొగాకు ఉత్పత్తులపై తయారీ తేదీ, ఎమ్మార్పీ, ఇతర పూర్తి సమాచారం ఉండాలన్నారు. అనుమతి లేని పొగాకు ఉత్పత్తులు అమ్మిన వారిపై కొట్పా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తనిఖీ బృందం సభ్యులు క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్, సోషల్ వర్కర్ చిరంజీవి, పోలీస్ కానిస్టేబుల్ ఉన్నారు.